కానరాని సంక్షేమం


లోగిశ గ్రామంలోని వసతిగృహం

- వసతిగృహాల్లో మౌలిక వసతులు కరువు
- తొమ్మిదేళ్లకే బీటలు వారిన వసతిగృహం
- 2016లో రూ.3కోట్లతో నిర్మాణం


విద్యార్థులు ఉండే గదుల తలుపులు ఇలా..


గజపతినగరం రూరల్: తమ పిల్లలను చదివించుకోలేని స్థితిలో ఉన్న తల్లిదండ్రులకు బాసటగా నిలిచి వారి చిన్నారులకు వసతి, భోజనంతో పాటు విద్యను కల్పించే దిశగా 2016లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం ఆధ్వర్యంలో మండలంలోని లోగిశ గ్రామంలో రూ.3కోట్లతో నిర్మించిన వసతిగృహం తొమ్మిదేళ్లకే బీటలు వారింది. మండలంలోని అన్ని వసతిగృహాలను ఏకం చేస్తూ సమగ్ర సంక్షేమ వసతిగృహం అని నామకరణం చేసి హడావుడిగా దీన్ని అప్పట్లో కిమిడి మృణాళిని ప్రారంభించారు. అయితే తొమ్మిదేళ్లకే వసతిగృహం పూర్తిగా పాడైంది. గదులకు తలుపుల్లేక, గోడలు బీటలు వారి ఎక్కడికక్కడే వర్షం పడితే నీరు ప్రవేశించి విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. ప్రారంభమైన తరువాత వసతిగృహం మెయింటెనెన్స్ సక్రమంగా లేకపోవడంతోనే భవనాలు దెబ్బతిన్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

కానరాని సౌకర్యాలు

ఇదిలా ఉంటే వసతిగృహంలో ఉండే విద్యార్థులకు కనీస వసతులు లేక అవస్థలు పడుతున్నారు. కొన్నేళ్లుగా తాగునీటి శుద్ధి యంత్రం మూలకు చేరింది. అలాగే విద్యుత్ పోయినప్పుడు వాడేందుకు ఏర్పాటు చేసిన ఇన్వర్టర్ కూడా మరమ్మతులకు గురై చీకట్లోనే విద్యార్థులు గడుపుతున్నారు. తలుపులు పగిలిపోయి గదుల్లోకి పురుగులు, విష జంతువులు వచ్చేస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు భయాందోళనలు చెందుతున్నారు. 90మంది ఉండే ఈ వసతిగృహంలో పూర్తి స్థాయి సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు నిత్యం అందుబాటులో ఉండాల్సిన వార్డెన్ సాయంత్రం పూట రావడం ఒక్కోసారి రోజు తప్పించి రోజు రావడంతో మరిన్ని ఇబ్బందులు తప్పడం లేదు.

కానరాని పర్యవేక్షణ

లోగిశలో ఉన్న సమగ్ర సంక్షేమ వసతిగృహాన్ని గడిచిన కొన్నేళ్లుగా ఉన్నతాధికారులు పర్యవేక్షణ చేయకపోవడంతో ఇక్కడున్న సిబ్బంది ఇష్టారీతిలో విధులు నిర్వహించడం జరుగుతుందని స్థానికులు చెబుతున్నారు. ఈ విషయమై వసతిగృహ వార్డెన్ అప్పలనాయుడు వద్ద సాక్షి ప్రస్తావించగా వసతిగృహ భవనం కొంతమేర పాడవ్వడం వాస్తవమేనని అంగీకరించారు. ఇన్వర్టర్, తలుపులు, మరుగుదొడ్లు, వంటి ఇబ్బందులు గుర్తించి ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్లగా మరమ్మతుల కోసం రూ.20లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ పనులు ఆర్అండ్‌బీ శాఖకు అప్పగించారని, త్వరలోనే పనులు ప్రారంభిస్తారని తెలిపారు.


మూలకు చేరిన తాగునీటి శుద్ధి యంత్రం


పాడైన మంచాలు


తలుపులు లేని మరుగుదొడ్లు

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

చీపురుపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధితో పాటు పిల్లల తల్లులకు పోషణ అవసరాలపై నిర్వహిస్తున్న శిక్షణ తరగతులను అంగన్‌వాడీ కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పీఓ ఎం.రాజేశ్వరి అన్నారు. మండలంలోని కర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోషణ్ బీ పఢాయీ కార్యక్రమంపై జరుగుతున్న శిక్షణ తరగతుల్లో ఆమె శుక్రవారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆరేళ్లలోపు పిల్లల పోషణ, ఆరోగ్య సంరక్షణ, మెరుగైన ఆట, ఆధారిత విద్య నైపుణ్యాలను పెంపొందించడం తదితర అంశాలు దీని ప్రధాన లక్ష్యమన్నారు. మండలంలో 88 మంది అంగన్‌వాడీ కార్యకర్తలను రెండు గ్రూపులుగా విభజించి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని తెలిపారు. శిక్షణలో ఫెసిలిటేటర్ సూపర్‌వైజర్లు జె.పైడిమంగమ్మ, టి.శ్రీదేవి, కో ఫెసిలిటేటర్ సూపర్‌వైజర్లు ఎం.నాగమణి, జె.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సీడీపీఓ

27న ఉప సర్పంచ్ ఎన్నిక

గుర్ల: మండలంలోని తెట్టంగి ఉప సర్పంచ్ ఎన్నికను ఈ నెల 27న చేపట్టనున్నట్టు ఎంపీడీఓ శేషుబాబు శుక్రవారం తెలిపారు. ఉప సర్పంచ్‌గా ఉన్న జమ్ము అనసూర్య రాజీనామా చేయడంతో ఉప సర్పంచ్ ఎన్నిక అనివార్యమైంది. ఈ నెల 27న ఈఓపీఆర్డీ అన్నపూర్ణదేవి ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తారని తెలిపారు.

శ్యామాయవలస ఉప సర్పంచ్ పదవికి..

మెరకముడిదాం: మండలంలోని శ్యామాయవలస గ్రామ ఉప సర్పంచ్ ఎన్నికకు ఎన్నికల సంఘం జారీ చేసిన నోటిఫికేషన్ ప్రతిని ఎంపీడీఓ కార్యాలయం ఏఓ సుదర్శన్ పట్నాయక్ శ్యామాయవలస పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం అతికించారు. శ్యామాయవలస సర్పంచ్ రెడ్డి శాంతికి ఒక ప్రతిని అందజేశారు. ఈ నెల 27వ తేదీన ఎన్నిక నిర్వహించనున్నట్టు నోటిఫికేషన్‌లో తెలిపారు.


మెరకముడిదాం: ఎన్నిక నోటిఫికేషన్‌ను పంచాయతీ కార్యాలయం వద్ద అతికిస్తున్న ఏఓ

సర్వేలతో అందని వైద్యం

వేపాడ: సర్వేల పేరుతో రోగులకు అందుబాటులో లేకపోతే ఎలా... రోగుల పరిస్థితి ఏంటి...వైద్యం మానేసి సర్వే చేసుకొండి అంటూ గ్రామస్తులు శుక్రవారం వైద్య సిబ్బందిని ప్రశ్నించారు. ప్రభుత్వం అన్ని శాఖలతో సర్వే నిర్వహిస్తుండటంతో అందులో భాగంగా ఆరోగ్య సిబ్బంది సర్వేల పేరుతో గ్రామాల్లో తిరగటంతో సబ్‌సెంటర్‌కు వచ్చే రోగులకు వైద్యం అందక అవస్థలు పడుతున్నారు. వేపాడ మండలం సోంపురం సబ్ సెంటర్‌లో వైద్య సిబ్బందిని శుక్రవారం గ్రామస్తులు, రోగులు ప్రశ్నించారు. సబ్‌సెంటర్‌లో మీరంతా సర్వేలకు వెళ్తే మా పరిస్థితి ఏంటి... మీరు వెళ్లే సమయం చెప్పండి.. గవర్నమెంటు చెప్పినట్టు చేయండి.. కానీ రోగుల ఆరోగ్య పరిస్థితి చూడాలి కదా... అని ప్రశినంచారు. సర్వేలో అప్‌లోడ్ చేసే విధంగా మా బాధను ప్రభుత్వానికి మీ అధికారులకు అప్‌లోడ్ చేయండి అంటూ ధ్వజమెత్తారు. దీంతో సబ్ సెంటర్ సిబ్బంది మాట్లాడుతూ మేము ఏమీ చేయగలం.. మా పరిస్థితి ఎవరికి చెప్పగలం...అని వాపోయారు.

సమస్యల వలయంలో వెంకటశివనగర్


కాలనీలో మూలకు చేరిన బోరు


రోడ్డుకు ఇరువైపుల పేరుకుపోయిన తుప్పలు


పేరుకుపోయిన మురుగు

కొత్తవలస: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న వెంకటశివనగర్‌లో సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. ఈ కాలనీలో 40కి పైగా కుటుంబాల వారు నివసిస్తున్నారు. కొత్తవలస - విజయనగరం రోడ్డు నుంచి కాలనీకి వెళ్లే ఏకైక మార్గం పూర్తిగా పిచ్చితుప్పలతో నిండిపోయింది. ఈ రోడ్డులో సాయంత్రం 6 గంటలు దాటితే రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని కాలనీ వాసులు వాపోతున్నారు. రోడ్డుకిరువైపులా తుప్పలు పెరిగిపోవడంతో పాములు సంచరిస్తున్నాయని, ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భాయందోళనలు చెందుతున్నారు. కాలనీలో సరైన మురుగు కాలువలు లేకపోవడంతో మురుగు పేరుకుపోయి దుర్వాసన వెదజల్లుతోంది. దోమలు, ఈగలకు ఆవాసాలుగా మారుతున్నాయని రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలనీలోని రెండు బోర్లు మూలకు చేరగా మరమ్మతులు చేయడం లేదని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బొండపల్లి: కేజీబీవీల్లో ఆరో తరగతితో పాటు ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికిగాను అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు దేవుపల్లి కేజీబీవీ ప్రిన్సిపాల్ కె.చంద్రకళ శుక్రవారం తెలిపారు. ఏప్రిల్ 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తులను ఆన్‌లైన్‌లోగాని, మీసేవ కేంద్రాలు, సచివాలయాల్లోగాని, నేరుగా కేజీబీవీలో కూడా చేసుకోవచ్చని తెలిపారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం


అంగన్‌వాడీలకు శిక్షణలో మాట్లాడుతున్న సీడీపీఓ ఆరుద్ర

గుర్ల: పౌష్టికాహారంతోనే గర్భిణులు, బాలింతలలో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని సీడీపీఓ ఆరుద్ర అన్నారు. మండలంలోని గుజ్జింగివలస హైస్కూల్‌లో అంగన్‌వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులకు తల్లిపాలు తప్పనిసరిగా ఇచ్చేలా తల్లులకు అవగాహన కల్పించాలన్నారు. శిక్షణలో సూపర్‌వైజర్లు రాధిక, శకుంతల తదితరులు పాల్గొన్నారు.

కొత్త బస్ షెల్టర్ వద్దే బస్సులు నిలపాలి

గజపతినగరం: మండల కేంద్రంలో ప్రతీ ఆర్టీసీ బస్సు కొత్తగా ఏర్పాటు చేసిన బస్సు షెల్టర్ వద్ద మాత్రమే నిలుపుదల చేయాలని ఎస్‌ఐ లక్ష్మణరావు సూచించారు. శుక్రవారం ఆర్టీసీ కంట్రోలర్‌తో కలిసి బస్‌లు నిలుపుదల చేసి విలేకరులతో మాట్లాడారు. గజపతినగరం బ్రిడ్జి ముందర ఏర్పాటు చేసి ఉన్న బస్ షెల్టర్‌ను దాటి బస్సు ఆపితే అపరాధ రుసుం విధిస్తామన్నారు. బస్సు షెల్టర్ దాటి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వద్ద నిలుపుదల చేస్తే ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. ఈ విషయమై సంబంధిత డిపో మేనేజర్‌కు కూడా లేఖ ద్వారా తెలియజేశామని తెలిపారు. ఆర్టీసీ డ్రైవర్లు నిబంధనలు తప్పనిసరిగా పాటించి సహకరించాలని కోరారు.

ఆంజనేయ స్వామి తీర్థ మహోత్సవం

వేపాడ: మండలంలోని బానాది గ్రామంలో శ్రీఆంజనేయ స్వామి తీర్థ మహోత్సవం సందర్భంగా స్వామివారికి శుక్రవారం ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పురోహితులు మేడపాటి కిషోర్ శర్మ మంత్రోచ్చారణాలతో ప్రత్యేక అష్టోత్తర శత నామాలతో పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త తుమ్మపూడి రమేష్‌బాబు, విజయలక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో అన్న సమారాధన కార్యక్రమం నిర్వహించారు. భర్తవానిపాలెం కోలాటం బృందంచే ప్రదర్శించిన కోలాటం ఆకట్టుకుంది.

వేలం పాట ఖరారు

శృంగవరపుకోట: పంచాయతీ పరిధిలో రోజువారీ మార్కెట్, వారపు సంత, కబేళాతో పాటు పలు పనులకు సంబంధించి టెండర్లు శుక్రవారం ఖరారు చేశారు. సరిపల్లి అమ్మాజీ రోజువారీ మార్కెట్‌ను రూ.8,02,000లు, వారపు సంతను రూ.6,300లకు దక్కించుకోగా, సులభ్ కాంప్లెక్స్ నిర్వహణను గునుంబిల్లి అచ్చియ్యమ్మ రూ.27,500లు, కబేళాను యాగాటి యశ్వంత్‌కు రూ.2300లకు ఖరారు చేశారు. శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వీటిని ఖరారు చేశారు. ఈఓ అనూరాధ, సర్పంచ్ సంతోషికుమారితో పాటు పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పరీక్ష కేంద్రం పరిశీలన


పరీక్ష కేంద్రం వద్ద వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్

దత్తిరాజేరు: మండలంలోని పెదమానాపురం పదో తరగతి పరీక్ష కేంద్రాన్ని తహసీల్దార్ విజయభాస్కర్ శుక్రవారం పరిశీలించారు. కేంద్రంలో ఎంత మంది పరీక్షలు రాస్తున్నదీ అడిగి తెలుసుకున్నారు. 146 మంది పరీక్ష రాస్తున్నారని తెలిపారు. పరీక్షలు సక్రమంగా జరిగేందుకు తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. అక్కడ ఉన్న వైద్య సిబ్బందితో మాట్లాడారు.

పక్కాగా ఉల్లాస్ నిర్వహించండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గిరిబాల

బొండపల్లి: ఉల్లాస్ కార్యక్రమం కింద ఈ నెల 23న ఆదివారం జరగనున్న పరీక్షను పక్కాగా నిర్వహించాలని ఎంపీడీఓ జి.గిరిబాల సూచించారు. స్థానిక వెలుగు కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, గ్రామైక్య సంఘాల వీఓలతో ఆమె శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఇప్పటికే గుర్తించిన నిరక్షరాస్యులందరినీ పరీక్షలకు తప్పనిసరిగా హాజరయ్యే విధంగా చూడాలన్నారు. సమావేశంలో వెలుగు ఏపీఎం కె.పెంటంనాయుడు, సీసీలు తదితరులు పాల్గొన్నారు.

మాత్రల పంపిణీపై ఆరా!


ఫైలేరియా మాత్రల పంపిణీ గురించి అడిగి తెలుసుకుంటున్న వైద్య బృందం సభ్యులు ఝాన్సీ, కేశవ్

గుర్ల: మండలంలోని 42 పంచాయతీల్లో గత నెలలో ఫైలేరియా మాత్రలను గుర్ల, తెట్టంగి పీహెచ్‌సీ సిబ్బంది ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. అయితే ఈ మాత్రల పంపిణీపై ప్రత్యేక కమిటీ సభ్యులు డాక్టర్ ఝాన్సీ, కేశవ్ మండల కేంద్రలో శుక్రవారం ఇంటింటికీ వెళ్లి ఆరా తీశారు. మాత్రలను సద్వినియోగం చేసుకున్నారా? లేదా? అనే విషయమై తెలుసుకున్నారు. గుర్ల పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీధర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏరియా ఆస్పత్రిలో నోటి శుభ్రతపై అవగాహన


ర్యాలీలో పాల్గొన్న వైద్యులు, సిబ్బంది

గజపతినగరం: ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో సూపరింటెండెంట్ డాక్టర్ జగదీష్ ఆధ్వర్యంలో వైద్యులు, వైద్య సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. నోటి సంరక్షణను వివరిస్తూ ర్యాలీలో అవగాహన కల్పించారు. చిన్ననాటి నుంచే దంత సంరక్షణపై శ్రద్ధ వహించాలని సూచించారు. జంక్ ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ జగదీష్, బాలాజీ, సత్యశేఖర్, వసుధ, భాను, ఆర్ఎంఓ కిరణ్, వినీత్ నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధితులకు దుస్తుల పంపిణీ


బాధితులకు దుస్తులు అందజేస్తున్న అల్లు పద్మ తదితరులు

శృంగవరపుకోట: జామిలోని రంభవీధి అగ్నిప్రమాద బాధితులకు జామి మండల వైఎస్సార్‌సీపీ నేత, జామి గ్రామ ఉప సర్పంచ్ అల్లు పద్మ శుక్రవారం దుస్తులు పంపిణీ చేశారు. జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కుమారుడు ప్రణీత్ మరణం పట్ల ఆమె తన సంతాపం తెలిపారు. ప్రణీత్ జ్ఞాపకార్థం బాధితులకు దుస్తులు పంపిణీ చేసినట్టు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ ఎస్.రమణారావు, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

వేపాడ: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ దొగ్గ సత్యవంతుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సీహెచ్ సూర్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి సభ్యులు హాజరు కావాలని కోరా రు. మండల స్థాయి అధికారులు పూర్తి స్థాయి సమాచారంతో హాజరు కావాలని కోరారు.

అమ్మవారిని దర్శించుకున్న డీఎస్పీ

చీపురుపల్లిలోని శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారిని చీపురుపల్లి డీఎస్పీ ఎస్.రాఘవులు కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు అమ్మవారి ప్రతిమను డీఎస్పీకి అందజేశారు.
– చీపురుపల్లి



సాగుపై అవగాహన ర్యాలీ



రానున్న ఖరీఫ్ సీజన్‌లో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా నవధాన్యాలు సాగు చేసి నేలను సారవంతం చేసేందుకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆధ్వర్యంలో వేపాడ మండలం చినగుడిపాల, కరకవలస, ఆకులసీతంపేట, వీలుపర్తి రామస్వామిపేట గ్రామాల్లో శుక్రవారం అవగాహన ర్యాలీలు నిర్వహించారు. సేంద్రియ ఎరువుల వాడకంతో ఆరోగ్యకరమైన పంటలు పండించుకోవచ్చని అవగాహన కల్పించారు. ర్యాలీలో యాంకర్ సన్యాసమ్మ, సర్పంచ్‌లు బోజంకి రామునాయుడు, వడ్లమాని శర్మ, సుంకరి రమణమ్మ, గ్రామ పెద్దలు ఎస్.అప్పారావు, దుల్ల అప్పన్న, రైతులు పాల్గొన్నారు.
– వేపాడ

దళితుల సమస్యలపై ఆందోళన



ఏళ్ల తరబడి కనీస వసతులు లేక దళితులు ఇబ్బందులు పడుతుంటే అధికారులు, పాలకులకు పట్టడం లేదని సీపీఎం నేతలు దళిత కాలనీలో నెలకొన్న సమస్యలపై జామి ఎంపీడీఓ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలిపారు. 1994లో 20 దళిత కుటుంబాల వారికి జామి మండలం భీమసింగి వద్ద ఇళ్ల పట్టాలిచ్చారని అయితే కొందరు తమ సొంత డబ్బులతో ఇళ్లు నిర్మించుకున్నారని, కొందరు నిర్మించుకోలేకపోయారని ప్రభుత్వం నుంచి ఎటువంటి సాయం అందలేదని తెలిపారు. ఇళ్ల స్థలాలున్నా ఇళ్ల స్కీం మంజూరు కాలేదన్నారు. అయితే ఇక్కడ ఉన్న వారికి కనీస వసతులు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఎం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా చేపట్టిన ఆందోళనలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ, మద్దిల రమణ, గాడి అప్పారావు, పలువురు దళితులు పాల్గొన్నారు.
– శృంగవరపుకోట

భూముల రీసర్వేతో వివాదాలకు పరిష్కారం



భూముల రీసర్వేతో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని దీనికి ప్రతి ఒక్కరూ సహకరించాలని తహసీల్దార్ బి.నీలకంఠరావు అన్నారు. కొత్తవలస మండలంలోని కొత్తవలస గ్రామంలో రీసర్వేపై గ్రామ సభను శుక్రవారం ఏర్పాటు చేశారు. అంతకు ముందు రైతులతో కలిసి గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆర్ఐ రాజేష్, పలువురు రైతులు పాల్గొన్నారు.
– కొత్తవలస

క్షయ వ్యాధిపై అవగాహన


విద్యార్థినిలకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారిణి రాజ్యలక్ష్మి

చీపురుపల్లి రూరల్(గరివిడి): క్షయ వ్యాధి పట్ల అవగాహన అవసరమని గరివిడి పీహెచ్‌సీ వైద్యాధికారిణి కె.రాజ్యలక్ష్మి అన్నారు. ఈ నెల 24న ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా గరివిడి కస్తూర్బా బాలికా విద్యాలయంలో జోనల్ సూపర్‌వైజర్ జి.లలిత ఆధ్వర్యంలో క్షయ వ్యాధిపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. రెండు వారాలకు మించి దగ్గు, జ్వరం, ఆకలి తగ్గటం, బరువు తగ్గిపోవడం, దగ్గినపుడు కఫంలో రక్తపు జీర రావడం లాంటి లక్షణాలు కనిపిస్తు వెంటనే కఫం పరీక్ష చేయించుకోవాలని సూచించారు. సీహెచ్‌ఓ ఎన్.సత్యంనాయుడు, కేజీబీవీ ప్రిన్సిపాల్ ఇ.ధనలక్ష్మి, అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.